నవరత్నాలతో ఇంటింటా ఆనందం

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


పిప్పరలో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: నవరత్న పథకాలతో రాష్ట్రంలో ఇంటింటా ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పర సచివాలయం-2 పరిధిలోని వడ్డిగూడెం ప్రాంతంలో నిర్వహించిన నువ్వే మా నమ్మకం జగన్, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలంతా అండగా ఉండాలన్నారు. 14 ఏళ్ల పాలనలో ప్రజలకు ఏమేలు చేయని చంద్రబాబు ఇప్పుడు మళ్లీ అధికారం ఇస్తే మేలు చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం అభివృద్ధిని చూసి ఓర్వలేని పచ్చమీడియా ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకుందని, వీరి బూటకపు మాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రికార్డుస్థాయిలో 30 లక్షలమంది పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చి పూడికచేసి, ఇళ్లునిర్మిస్తున్న ప్రభుత్వం ఎక్కడైనా ఉందా అన్న విషయం ఆలోచించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్నది ఆరా తీశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలులో లోపాలు ఉంటే వాటిని సరిదిద్దడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఇంటింటికి వెళ్లి గత నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన పథకాలను వివరించారు. పథకాలకు సంబంధించిన బ్రోచర్లు అందచేశారు. జగనన్నే మాభవిష్యత్తు స్టిక్కర్లను గృహ యజమానుల అనుమతి మేరకు ఆయా గృహాలకు అతికించారు. ఆయా ప్రాంతాలలో మహిళలు, యువకులు, వృద్ధులతో ప్రభుత్వ పనితీరు, పథకాల అమలుపై ఎమ్మెల్యే వాసుబాబు పలు ప్రశ్నలు వేసి వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్ కాకర బేబీ, మండల ఉపాధ్యక్షురాలు నీతిపూడి వీరమ్మ, ఎంపీటీసీ వీరవల్లి దానమ్మ, పార్టీ నాయకులు కాకర్ల శ్యాం, ముత్యాల రాంబాబు, ఇందుకూరి ప్రకాష్‌రాజు, ముగ్గళ్ల అప్పారావు, ఐఎస్ఎన్ రాజు, కొండలరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

దెందులూరు : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపొందడం ఖాయమని జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. గురువారం పోతునూరులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించి కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మత, వర్గాల, పార్టీలకతీతంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం చేసి అమలు చేసి చూపిస్తున్నారని, దీంతో ప్రజలు గ్రాఫిక్స్ మాయమాటలు, బూటకపు వాగ్దానాలను కోరుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ మండల బూత్ మేనేజర్ తలారి రామకృష్ణ, ఎంపీటీసీ సున్నా నరేష్, పార్టీ కార్యదర్శి రమేష్, నాయకులు బుద్దా అర్జునా, బీశెట్టి నూకరాజు, గృహసారథులు, వలంటీర్లు ఉన్నారు.


పోతునూరులో జగనన్న స్టిక్కర్‌ను అతికిస్తున్న సర్పంచ్ బోదుల స్వరూప్, నాయకులు

అంగన్‌వాడీ చిన్నారుల్లో విద్య, ఆటలకు ప్రాధాన్యం


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను ఆటలాడిస్తున్న దృశ్యం

దెందులూరు: చల్లచింతలపూడి అంగన్‌వాడీ కేంద్రాన్ని సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ స్కీమ్ ప్రతినిధి ఎం.సంధ్య సందర్శించారు. కేంద్రంలో ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యూకేషన్) కార్యక్రమాలను పరిశీలించారు. పిల్లలను ఎలా ఆడిస్తున్నారు, విద్య ఎలా ఉంది తదితర అంశాలను పరిశీలించారు. పిల్లల తల్లులతో సమావేశమై వారి ఆరోగ్యం, అభివృద్ధిపై అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు ఉన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

పెదపాడు : పెదపాడు మండలంలోని కొణికి గ్రామానికి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ కంటి వెలుగు పేదలకు వరం


మొయ్యేరులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం : గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలకు, వృద్ధులకు వైఎస్సార్ కంటి వెలుగు వరం లాంటిదని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మొయ్యేరు సర్పంచ్ దుళ్ల కుటుంబరావు అన్నారు. స్థానిక సచివాలయంలో గురువారం వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా 62 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు అవసరమని, వీటిని త్వరలోనే ఉచితంగా అందచేస్తామని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కంటికి సంభందించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మే 9 నుంచి అంజన్న ఉత్సవాలు


ఆలయంలో ఉత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ

పెదపాడు : అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మే 9 నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉత్సవాలకు పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నెర్సు నాగభూషణం, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సుంకర సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా పోస్టర్లతో పాటు బుక్‌లెట్లు, కరపత్రాలను విడుదల చేశారు. తొలుత అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, శృంగారం వెంకట శేష రామానుజాచార్యులు పూజలు నిర్వహించారు.

సమయాన్ని వృథా చేయకుండా పనిచేయాలి


ఉపాధి కూలీలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

పెదవేగి : ప్రభుత్వం నిర్దేశించిన సమయాన్ని వృథా చేయకుండా పనిచేస్తే చక్కటి వేతనాలు పొందవచ్చునని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ అన్నారు. మండలంలోని బి సింగవరం గ్రామంలో ఉపాధి పనులు జరిగే ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. పనుల పనితీరును పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి పని చేస్తే గిట్టుబాటు కూలి పొందవచ్చని కూలీలకు సూచించారు. కూలీలకు తాగునీరు అందుబాటులో ఉంచాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఎండ దెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

సర్పంచ్ లక్ష్మి సుజాతకు సత్కారం


సర్పంచ్ లక్ష్మి సుజాత, కార్యదర్శి ఆదిలక్ష్మిలను సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు : ప్రభుత్వ నిబంధనలను అనుసరించి నూరు శాతం లక్ష్యాలను సాధించిన కొత్తగూడెం గ్రామ సర్పంచ్ లక్ష్మి సుజాత, కార్యదర్శి ఆదిలక్ష్మి అభినందనీయులని ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కొత్తగూడెం గ్రామ సర్పంచ్ లక్ష్మి సుజాత, కార్యదర్శి ఆదిలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ మాట్లాడుతూ సమన్వయం, ప్రణాళికతో విధులు నిర్వర్తిస్తే ఏ రంగంలోనైనా గుర్తింపు సాధ్యమేనన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పోలవరం రూరల్ : రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని హోంమంత్రి తానేటి వనితకు రైతులతో కలిసి వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దత్తి రాంబాబు వినతిపత్రం సమర్పించారు. మండలంలో అత్యధిక శాతం మొక్కజొన్న పంట వేశారని, దళారుల చేతుల్లో రైతులు నష్టపోతున్నారని, రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జ్వరాలపై అపోహలు వద్దు


మొయ్యేరులో ఆరోగ్య అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం : సీజనల్ జ్వరాలపై అపోహలు వీడాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని గుర్తించాలని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని మొయ్యేరు గ్రామంలో ప్రజలకు అంటువ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. టైఫాయిడ్, డెంగీతో పాటు అనేక రకాల అంటు వ్యాధులకు మూలం అపరిశుభ్రత, దోమల పెరుగుదల కారణమన్నారు. గ్రామాలలో వ్యాధుల వ్యాప్తి, లక్షణాలు, దోమల వ్యాప్తి, నివారణ, ఫ్రైడే డ్రైడేగా పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే నిర్వహించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటించడం ద్వారా అంటు వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు ఇంటూరి పాపయ్యచౌదరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ దినోత్సవం


గ్రాడ్యుయేషన్ దినోత్సవంలో పాల్గొన్న ఎంఈవో, ప్రజాప్రతినిధులు

గణపవరం : కాశిపాడు నెం.1, నెం.2 పాఠశాలల్లో గురువారం గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో పుచ్చల శేషు మాట్లాడుతూ నాడునేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయని, బోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి విద్యార్థులకు నూతన తరహాలో పాఠ్యాంశ బోధన జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఎంపీటీసీ జంపన పద్మావతి రమేష్‌రాజు, గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ చిన్నం సిల్వెస్టర్‌రాజు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, విద్యాకమిటీ చైర్మన్లు సత్యనారాయణ, కె.సాయి, హెచ్ఎంలు టి.రంగనాయకులు, మంజుల, ఉపాధ్యాయులు సీహెచ్ కృష్ణ, పార్వతి, దుర్గ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన


ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ఉంగుటూరు: గోపీనాథపట్నం ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను, శివాలయ నిర్మాణాన్ని రాష్ట్ర మంత్రి కొట్టు సత్యానారాయణ గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట గోపీనాథపట్నం సర్పంచ్ పి.విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు గంట లక్ష్మణరావు ఉన్నారు.

నేడు చేబ్రోలులో గడపగడపకు

ఉంగుటూరు: చేబ్రోలు గ్రామంలో శుక్రవారం సాయంతం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెదపాడు : మండలంలోని సత్యవోలు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బేత దుర్గా ఫణీంద్ర బాబును అరెస్ట్ చేసినట్లు ఎస్సై బి.నాగబాబు తెలిపారు. అతని వద్ద నుంచి 54 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

నలుగురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళను కొట్టి గాయపర్చిన నేరంపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం స్వర్ణవారిగూడెంకు చెందిన పసుపులేటి వెంకటలక్ష్మి నరసమ్మకు మండలంలోని పట్టెన్నపాలెం గ్రామంలో 4.27 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో పామాయిల్ మొక్కలు వేసి సాగు చేసుకుంటున్నారు. ఈ నెల 19న పొలంలో పనిచేస్తుండగా, పుసుపులేటి రత్తమ్మ, తొమ్మిదేళ్ల సుబ్బలక్ష్మి, తొమ్మిదేళ్ల సూర్యచంద్రరావు, తొమ్మిదేళ్ల రవికుమార్ పొలంలోకి ప్రవేశించి నరసమ్మను కొట్టి గాయపర్చారని, అలాగే చంపుతానని బెదిరించినట్లు నరసమ్మ ఫిర్యాదులో పేర్కొంది. నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

గురుకుల విద్యార్థులకు అభినందనలు

పెదవేగి : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో విద్యనభ్యసించి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్ భారతి గురువారం అభినందించారు. సీనియర్ ఎంపీసీలో 963 మార్కులతో వలదాసి డిడియోన్ హడ్సన్ టైలర్ మొదటి స్థానం సాధించగా, గొల్లపల్లి అవినాష్ 932 మార్కులతో ద్వితీయ స్థానం, కె.నరసింహ 924 మార్కులతో మూడవ స్థానం సాధించారు. అలాగే సీనియర్ బైపీసీలో లక్కపాము కమలాకర్ 959 మార్కులతో మొదటి స్థానం సాధించగా మేరుగు అక్షయ్‌కుమార్ 944 మార్కులతో ద్వితీయ స్థానం, నారపాము అకిల్‌బాబు 942 మార్కులతో తృతీయ సాధించారు. ఈవిద్యార్థులను ప్రిన్సిపాల్ భారతి అభినందించారు.

అచ్చమ్మ తల్లి సన్నిధిలో...


గుంటూరు డీఎస్పీ మేకా సుధాకర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

దెందులూరు: గుంటూరు డీఎస్పీ మేకా సుధాకర్, కనకదుర్గ దంపతులు గురువారం గాలాయగూడెంలోని శ్రీ అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా ఏటా జరిగే అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నట్లు తెలిపారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు డీఎస్పీ దంపతులను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు.

ఇద్దరు వ్యక్తుల ఘర్షణ.. ఒకరికి తీవ్ర గాయాలు

చింతలపూడి: యర్రగుంటపల్లిలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లికి చెందిన కల్లెపల్లి యోహాను, సంఘసాని శ్రీను పెయింటింగ్ పనులు నిర్వహిస్తుంటారు. వీరు గురువారం యర్రగుంటపల్లిలో ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ జరగడంతో , యోహాన్ తన చేతిలోని కర్రతో శ్రీనును కొట్టాడు. అనంతరం ఆ కర్రను లాక్కొని శ్రీను దాడి చేయడంతో యోహాన్ తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన యోహాన్‌ను స్థానికులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలి

- ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి
- నారాయణపురంలో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి

ఉంగుటూరు : ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉన్న ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పంచాయితీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్) పోతిరెడ్డి నాగార్జున అన్నారు. గురువారం నారాయణపురం లయన్స్ కల్యాణ మండపంలో మండల స్థాయి ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూడా గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఎంతో మంచి పేరు సాధించిన ఎమ్మెల్యే వాసుబాబును కూడా వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ పల్లెలే పంచాయితీరాజ్‌కు పట్టుకొమ్మలని, దానికి మీరు నాగార్జున చైర్మన్‌గా రావడం శుభపరిణామమని అన్నారు. సమావేశంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి, సర్పంచులు తమ్మిన శ్రీను, వస్కాకుమార్‌రాజ, కంకట పద్మలీల, ఎంపీడీవో ఆంజనేయులు, డీపీవో విజయలక్ష్మి, డ్వామా పీడీ రాము, డీఎల్‌డీవో రమణ, డీఈ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సమీక్ష

మండలంలో పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పంచాయితీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్) పోతిరెడ్డి నాగార్జున రెడ్డితో ఎమ్మెల్యేవాసుబాబు వివిధ సమస్యలపై సమీక్షించారు. ప్రతి గ్రామంలో నిర్మించి చివరిదశలో ఉన్న భవనాలకు ప్రభుత్వం ఇస్తానన్న రూ.3.80 లక్షలను విడుదల చేయాలని, అలాగే మండలంలో లింకు రహదార్ల నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని, జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణపవరం: గణపవరం మండలం మొయ్యేరులోని 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మొయ్యేరు, ముప్పర్తిపాడు డి.కుముదవల్లి, కోమర్రు, తాళ్లపాలెం, వెంకట్రాజపురం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

పెదవేగి మండలంలో...

పెదవేగి : రాయుడుపాలెం, బాపిరాజుగూడెం, విజయరాయి 33 కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ టి శశిధర్ చెప్పారు. రాట్నాలకుంట, రాయుడుపాలెం, బాపిరాజుగూడెం, నడిపల్లి, విజయరాయి, కొండలరావుపాలెం, గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

భీమడోలు : కట్నం కోసం భర్త, ఆతని నాయనమ్మ, తాతయ్య వేధిస్తున్నారంటూ ఓ వివాహిత భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. ఆగడాలలంక గ్రామానికి చెందిన పెండెం ధనకర్, దివ్యజ్యోతి మూడేళ్ల కితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఓ బాబు పుట్టాడు. అయితే ఇటీవల చెడు వ్యసనాలకు బానిసైన ధనకర్ కట్నం తేవాలంటూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని, డు.ధనకర్‌కు ఆతని నాయనమ్మ మార్తమ్మ, తాతయ్య ముసలయ్య సహకరిస్తున్నారని దివ్యజ్యోతి ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

గణపవరం: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో గణపవరం ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ ఎం.రఘు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 60 శాతం, ద్వితీయ సంవత్సరంలో 71 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో కె.సువర్ణరాణి అత్యధికంగా 963 మార్కులు, ప్రథమ సంవత్సర ఫలితాల్లో టి.భవాని 460 మార్కులు సాధించినట్లు తెలిపారు. గణపవరం చాణక్య జూనియర్ కాలేజి ఇంటర్ ఫలితాలో 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అడపా సూరిబాబు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో కె.సునీత 470 మార్కులకు 461 అత్యధిక మార్కులుసాధించడం అభినందనీయమన్నారు.

గురుకులలో 73.33 శాతం ఉత్తీర్ణత

భీమడోలు : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పోలసానిపల్లి బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 73.33 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి గురువారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులకు చెందిన 76 మందికి గాను 55 మంది ఉత్తీర్ణత సాధించి 73.33 శాతం సాధించారన్నారు. ఏ గ్రేడు 30, బీ గ్రేడు 22, సీ గ్రేడు 3 సాధించారన్నారు. వారిలో అత్యధిక మార్కులు ఎంపీసీలో 880 మార్కులు, బైపీసీలో 953 మార్కులు పొందారన్నారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి 80 మందిలో 36 మంది ఉత్తీర్ణత సాధించారు. భీమడోలులోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరానికి చెందిన 142 మందిలో 94 మంది ఉత్తీర్ణులై 66 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. వెయ్యి మార్కులకుగాను సీఈసీ గ్రూపులో బొప్పిడి సమీరా 858, కె.సూరజ్ 821, బైపీసీలో వాకమూడి పవన్‌కుమార్ 812, కుర్రెళ్ల స్వప్న 812 మార్కులు సాధించారన్నారు. ఎంపీసీలో కేఎం వెంకట వాసవి అత్యధికంగా 804 మార్కులు సాధించిందన్నారు. ప్రథమ సంవత్సరానికి చెందిన 116 మందికి గాను 59 మంది పాసై 51శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సీఈసీ నందు ఎస్.ప్రమీలా 384 మార్కులు, ఎంపీసీలో జంగం అమూల్య 374 మార్కులు పొంది ప్రథమంగా నిలిచారన్నారు.

జీడి మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

జంగారెడ్డిగూడెం : గిట్టుబాటు ధర లేక జీడి మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 80 కేజీల బస్తా జీడి పిక్కలకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జీడి మామిడి పంటకు మద్దతు ధర - ప్రభుత్వం కొనుగోలు అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జీడి పిక్కలు ధర బస్తా రూ.8 వేలు మాత్రమే ఇస్తున్నారని, దీని వలన జీడి మామిడి రైతులు వ్యాపారుల చేతిలో దోపిడీకి గురి అవుతున్నారని అన్నారు. జీడిమామిడి రైతులకు న్యాయమైన ధర చెల్లించి ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జీడి మామిడి రైతు మాండ్రు సూర్య చంద్రం తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

భీమడోలు : గుండుగొలనులో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన జంగం దావీదురాజు కుటుంబానికి గురువారం పలువురు సహాయం అందించారు. భీమడోలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందించగా, వైఎస్సార్ సీపీ నేత పున్నం గోపి నూతన వస్త్రాలను అందించారు. అలాగే పూడి శ్రీనివాసరావు వెయ్యి రూపాయలు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మండల చైర్మన్ గుల్ల నూకరాజు, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, ప్రతినిధులు బర్ల రమణమూర్తి, పూడి శ్రీనివాసరావు, మామిళ్లపల్లి కాశీబాబు, చింతా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూమి సారవంతం

కామవరపుకోట : నవధాన్యాలతో భూమి సారవంతం అవుతుందని సేంద్రియ వ్యవసాయ కామవరపుకోట మండలం తడికలపూడి క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జ్ కె.వెంకటలక్ష్మి అన్నారు. గురువారం తడికలపూడి రైతు భరోసా కేంద్రంలో ఏసీఆర్‌పీలకు నవధాన్యాలు అందజేశారు. ఈ సందర్భంగా 30 రకాల విత్తనాలతో 250 నవధాన్యాలు గల కిట్స్ తయారు చేసి రైతులకు ఇచ్చి వాటి ఉపయోగాలు గూర్చి రైతులకు వివరించారు.